క్లుప్తంగా

చల్లగా చూడు ఎల్లమ్మ తల్లి


భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల సూర్యగిరి ఎల్లమ్మ తల్లి కొంగు బంగారంలా మారింది. మంగళవారం అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో భక్తులు దర్శనం కోసం ఉదయం నుంచే క్యూలో ఉన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు, బోనం సమర్పించుకున్నారు. సామూహిక శ్రీ సత్యనారాయణస్వామి వ్రతాలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, ఈఓ మోహన్‌రావు, సిబ్బంది కాశీనాథ్, అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణకు ఆహ్వానం


ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డితో డబిల్‌గూడ గౌడ సంఘం నాయకులు

మహేశ్వరం: మండల పరిధిలోని డబిల్‌గూడ గ్రామంలో ఈ నెల 24న గౌడ సంఘం ఆధ్వర్యంలో జరిగే సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణకు హాజరుకావాలని మంగళవారం ప్రముఖులను ఆహ్వానించారు. చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్‌లకు గౌడ సంఘం నేతలు ఆహ్వాన పత్రికలను అందజేశారు. కార్యక్రమంలో గౌడ సంఘం గ్రామ అధ్యక్షుడు అల్వాల చంద్రశేఖర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి అల్వాల బాలకృష్ణాగౌడ్, బీజేపీ మండల అధ్యక్షుడు యాదిష్, నాయకులు శంకర్, పాండుగౌడ్, ఓంప్రకాష్ గౌడ్, రాఘవేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మహా ప్రదర్శనను జయప్రదం చేయాలి

మంచాల: ఎమ్మార్పీఎస్ ఆరుట్ల గ్రామ కమిటీ నూతన అధ్యక్షుడిగా మంకు సురేష్‌ను ఎన్నుకున్నట్లు ఆ సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జి సిద్దాపురం శ్రీకాంత్ తెలిపారు. మంగళవారం మండలంలోని ఆరుట్లలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వచ్చే నెల 7న నగరంలో జరిగే వెయ్యి గొంతులు-లక్ష డప్పులు మహా ప్రదర్శనను జయప్రదం చేయాలని కోరారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులు సంఘం కోసం కష్టపడి పని చేయాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నేతలు సుధాకర్, శంకర్, ప్రసాద్, వంశీ, శంకర్, ఆనంద్, నర్సింహ, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

సెమిస్టర్ ఫీజులు తగ్గించాలి

తుర్కయంజాల్: పెంచిన ఎంబీఏ సెమిస్టర్ పరీక్షల ఫీజులను వెంటనే తగ్గించాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.శివ కుమార్ గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం తుర్కయంజాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సెమిస్టర్ ఫీజు రూ.5వేలు వసూలు చేయడంతో పేద విద్యార్థులకు భారంగా మారిందన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్‌లను విడుదల చేయకుండా, సెమిస్టర్ ఫీజులను పెంచడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే పెంచిన ఫీజులను తగ్గించాలని డిమాండ్ చేశారు.

బీజేపీ బలోపేతానికి కృషి

ఆమనగల్లు: మున్సిపాలిటీలో మరోసారి బీజేపీ విజయం సాధించాలని, ఇందుకోసం సమష్టిగా కృషి చేయాలని పార్టీ ఆమనగల్లు మున్సిపాలిటీ అధ్యక్షుడు కర్నాటి విక్రంరెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలో బీజేపీ బూత్ కమిటీ అధ్యక్షుల సమావేశం నిర్వహించారు. ఇటీవల ఎన్నికైన వారిని విక్రంరెడ్డి సత్కరించారు. ఆయన మాట్లాడుతూ.. బీజేపీ బలోపేతం కోసం ప్రతిఒక్కరూ పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహ, లక్ష్మణ్, రవిరాథోడ్, విష్ణుచారి, ప్రవీణ్ రెడ్డి, సాయిబాబా, అశోక్, శ్రీను పాల్గొన్నారు.

పేద విద్యార్థినికి చేయూత

ఆమనగల్లు: ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతున్న ఓ విద్యార్థినికి తలకొండపల్లి జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్ చేయూతనందించారు. జంగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన శైలజ హైదరాబాద్‌లోని బీఎన్‌రెడ్డి నగర్‌లో ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతుంది. ఆమె ఫీజు చెల్లించడానికి ఇబ్బందులు పడుతుండటంతో రూ.25 వేలను వెంకటేశ్ తరఫున నేతలు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో ఆంజనేయులుగౌడ్, మల్లేశ్, సంపత్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ ఫలాలు

- గ్రామసభలో తహసీల్దార్ సైదులు
- ఆయా గ్రామాల్లో అర్హుల జాబితాను వెల్లడించిన అధికారులు


మహేశ్వరం: అమీర్‌పేట్ గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్ సైదులు


మహేశ్వరం: గొల్లూరు గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్ శైలజ

మహేశ్వరం: అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వం అమలు చేస్తున్న నాలుగు పథకాలను అందజేస్తామని తహసీల్దార్ సైదులు పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని అమీర్‌పేట్ గ్రామంలో గ్రామసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా పథకాల అమలుకు అర్హుల జాబితాను వెల్లడించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రజాపాలనలో దరఖాస్తులను పరిశీలించి లబ్ధిదారులను ఎంపిక చేస్తామన్నారు. సాగుకు యోగ్యత కలిగిన భూములకే రైతు భరోసా కల్పిస్తామన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులను అందిస్తామన్నారు. ఎవరైనా పేరు రానివారు ఉంటే గ్రామ సభలలో మళ్లీ దరఖాస్తులు చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు చాకలి యాదయ్య, ఆవుల యాదయ్య, మాజీ సర్పంచ్ బస్వ శ్రీశైలంగౌడ్, మాజీ ఉపసర్పంచ్ పోతుల నర్సింగ్, పంచాయతీ కార్యదర్శి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పేరు లేకుంటే మళ్లీ దరఖాస్తులు చేసుకోవాలి

ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హత ఉండి లిస్టులో పేర్లు రాకపోతే మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ శైలజ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని గొల్లూరు గ్రామంలో ప్రభుత్వ సంక్షేమ పథకాల ఎంపికకు గ్రామసభ నిర్వహించి అర్హుల జాబితాను ప్రకటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అర్హత ఉండి జాబితాలో పేర్లు రాక పోతే ఆందోళన చెందొద్దని, మళ్లీ దరఖాస్తులు చేసుకోవాలని ఆమె సూచించారు. మండల పరిధిలోని ఆకన్‌పల్లి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు.

జల్‌పల్లి మున్సిపాలిటీలో..


మీర్‌పేట: జిల్లెలగూడలో దరఖాస్తు స్వీకరిస్తున్న కార్పొరేటర్ రాంచందర్


జల్‌పల్లిలో వార్డుసభ వద్ద వివరాలు అడిగి తెలుసుకుంటున్న పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలో మంగళవారం 13 వార్డుసభలు ఆమోదం తెలిపాయి. మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రామ్ పర్యవేక్షణలో ఫీల్డ్ ఆఫీసర్, వార్డు కౌన్సిలర్ల సమక్షంలో పథకాల జాబితా వివరాలను లబ్ధిదారులకు తెలియజేసి ఆమోదం తెలిపారు. జల్‌పల్లి మరాఠ భవన్‌లో నిర్వహించిన 16వ వార్డు సభను రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు, మహేశ్వరం డీసీపీ సునీతా రెడ్డి, పహాడీషరీఫ్ ఇన్‌స్పెక్టర్ గురువారెడ్డి, బాలాపూర్ తహసీల్దార్ ఇందిరా దేవిలు స్వయంగా పరిశీలించారు. దాదాపు జాబితాలో ప్రదర్శించిన వారి రేషన్ కార్డులకు ఆమోదం లభించిందని మున్సిపల్ కమిషనర్ తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన జాబితా త్వరలో ఫైనల్ అవుతుందన్నారు. రేషన్ కార్డులకు సంబంధించిన ఎవరి పేర్లయినా రాలేదనుకుంటే, మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సభలలో చైర్మన్ అబ్దుల్లా సాది, వైస్ చైర్మన్ ఫర్హానా నాజ్, కౌన్సిలర్లు బుడుమాల యాదగిరి, కెంచె లక్ష్మీనారాయణ, పండెం పుష్పమ్మ కొండల్‌యాదవ్, భాషమ్మ, అహ్మద్ కసాది, జింకల రాధిక తదితరులు పాల్గొన్నారు.

అందరికీ అమలు చేయాలి: బీఆర్‌ఎస్ నేత అర్జున్

జల్‌పల్లి మున్సిపాలిటీలోని మరాఠ భవన్ వద్ద కొనసాగుతున్న వార్డుసభ వద్దకు చేరుకున్న బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు యంజాల అర్జున్ ప్రజాపాలన సందర్భంగా దరఖాస్తు చేసుకున్న వారందరికీ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేవలం కొద్ది మందికే పథకాలను అమలు చేస్తూ ప్రభుత్వం ప్రచార ఆర్భాటం చేస్తోందన్నారు. దీంతో అక్కడే ఉన్న పోలీసులు అతడిని బయటికి తీసుకెళ్లారు.

సద్వినియోగం చేసుకోవాలి

మీర్‌పేట: వార్డుసభలను అర్హులైనవారు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ జ్ఞానేశ్వర్ సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మంగళవారం కార్పొరేషన్ పరిధిలోని దాదాపు 20 డివిజన్‌లలో వార్డుసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల జాబితాను ప్రకటించడంతో పాటు నూతన దరఖాస్తులను కూడా స్వీకరించామని ఈ సందర్భంగా కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో మేనేజర్ చంద్రప్రకాశ్ రెడ్డి, ఆర్‌ఓ చంద్రశేఖర్‌రెడ్డి, అధికారులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

13 గ్రామాల్లో కొనసాగింపు

కందుకూరు: సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని కందుకూరు ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి సూచించారు. మంగళవారం మండల పరిధిలోని 13 గ్రామాల్లో ప్రభుత్వ పథకాలకు సంబంధించి లబ్ధిదారుల వివరాలను గ్రామ సభలు నిర్వహించి ప్రకటించారు. ఈ సందర్భంగా పులిమామిడి, పెద్దమ్మతండాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. కాగా పలు గ్రామాల్లో నిర్వహించిన సభల్లో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద ఎంపిక చేసిన లబ్ధిదారులకు చాలా మందికి భూములు ఉన్నాయని ఫిర్యాదులు వచ్చాయి. అర్హులైన వారికి ఇల్లు, రేషన్ కార్డుల జారీలో తమ పేర్లు లేవని అధికారుల దృష్టికి తెచ్చారు. అర్హులైన వారికి పథకాల్లో తమ పేర్లు నమోదు కాకపోతే మరోసారి దరఖాస్తు చేసుకోవాలని పరిశీలించి లబ్ధిచేకూరేలా చూస్తామని తెలిపారు. కాగా పెద్దమ్మతండా, దావూద్‌గూడ తండాల్లో ఎంపీడీఓ సరిత, రాచులూరు, బేగంపేటల్లో తహసీల్దార్ గోపాల్, గూడూరు, అన్నోజిగూడల్లో ఎంపీఓ గీత, బేగరికంచె, మీర్‌ఖాన్‌పేటల్లో ఏఈఓ సతీశ్, గుమ్మడవెల్లి, కొలన్‌గూడల్లో ఏఈఓ శారద, పులిమామిడి, ధన్నారంలో ఏపీఓ రవీందర్‌రెడ్డి, బాచుపల్లిలో ఏఓ లావణ్య ఆధ్వర్యంలో గ్రామసభలు కొనసాగాయి. ఆయా గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అర్హులందరికీ అందజేస్తాం

తుక్కుగూడ: రాష్ట్ర ప్రభుత్వం అర్హులకు సంక్షేమ పథకాలను అందించడానికి వార్డు సభలను నిర్వహిస్తుందని మున్సిపల్ చైర్‌పర్సన్ బరిగెల హేమలత సూచించారు. మంగళవారం పుర పరిధిలోని రావిర్యాల గ్రామ పరిధిలోని 1, 2, 3, 4, 5 వార్డుల్లో వార్డు సభలను నిర్వహించారు. మున్సిపాలిటీ వ్యాప్తంగా మరో రెండు రోజులు ఈ సభలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఏ.వాణి, కౌన్సిలర్లు బోధ యాదగిరిరెడ్డి, కాంటేకర్ మధుమోహన్, తూర్పు అనిత, వై.శివకుమార్, ఆర్.మౌనిక, మేనేజర్ పర్వతాలు, వార్డు అధికారులు, ఆయా పార్టీల నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.


కందుకూరు: పులిమామిడి గ్రామసభలో మాట్లాడుతున్న ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి



తుక్కుగూడ: దేవేందర్‌నగర్‌కాలనీలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ హేమలత

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

ఏసీపీ లక్ష్మీకాంతరెడ్డి


సీసీ కెమెరాల ప్రాధాన్యతను వివరిస్తున్న ఏసీపీ లక్ష్మీకాంతరెడ్డి

పహాడీషరీఫ్: దొంగతనాల నివారణ కోసం వ్యాపారస్తులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడానికి ముందుకు రావాలని మహేశ్వరం డివిజన్ ఏసీపీ పి.లక్ష్మీకాంత రెడ్డి సూచించారు. బాలాపూర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం.సుధాకర్‌తో కలిసి స్థానిక మండీ హోటళ్ల నిర్వాహకులతో సోమవారం రాత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండీ హోటళ్ల నిర్వాహకులు ట్రేడ్ లైసెన్స్ సమయానికి అనుగుణంగా నడుపుకోవాలన్నారు. హోటళ్ల ముందు పార్కు చేసిన వాహనాలు చోరీ కాకుండా, రాత్రి పూట హోటళ్లు మూసేశాక కూడా దొంగతనాలు జరగకుండా విధిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా బుధవారం పలు కాలనీల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజనల్ ఇంజినీర్ కే.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ టీఎస్ హౌసింగ్‌బోర్డ్, ఇందు అరణ్య అపార్ట్‌మెంట్ ఫీడర్ల పరిధిలోని కాలనీలలో మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకు. 11కేవీ వాంబేకాలనీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని, వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ఉండాలి

చేవెళ్ల: ప్రజలు, వాహనదారులకు రోడ్డు భద్రతా నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని ట్రాఫిక్ సీఐ వెంకటేశం అన్నారు. మండలంలోని దామరగిద్ద సమీపంలో మంగళవారం చేవెళ్ల ట్రాఫిక్ పోలీస్ ఆధ్వర్యంలో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా పాదాచారులు, రోడ్డు భద్రత, ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. పాదాచారులు రోడ్లు దాటే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, జీబ్రా క్రాసింగ్‌ల వద్దనే రోడ్డుదాటాలని సూచించారు. వాహనదారులు అతి వేగంతో వాహనాలు నడిపి ప్రమాదాలకు గురికావొద్దన్నారు.

26 నుంచి శతచండీ యాగం

కందుకూరు: మండలంలోని దాసర్లపల్లి సమీపంలోని రేవెళ్ల జనార్దన్‌శర్మ వ్యవసాయ క్షేత్రంలో ఈ నెల 26 నుంచి 28వ తేదీ వరకు మూడురోజుల పాటు 108 యజ్ఞగుండాలతో శ్రీరుద్ర సహిత శత చండీ యాగాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు చండీ ఉపాసకుడు రేవెళ్ల రాజుశర్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2012 నుంచి 2024 వరకు 12 సంవత్సరాలుగా ప్రతి నెల మాస శివరాత్రి రోజున చండీ యాగాన్ని అక్కడ నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఈ సంవత్సరం కూడా శత చండీ యాగాన్ని నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. 26న ఉదయం 8 గంటలకు మహాగణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్య ప్రాశనం, గోపూజ, ధ్వజారోహణం, యాగశాల ప్రవేశం అనంతరం 10.30 గంటలకు 108 గుండాలలో శ్రీరుద్ర సహిత శత చండీ యాగాన్ని ప్రారంభించనున్నామన్నారు. మధ్యాహ్నం లక్ష్మీనర్సింహాస్వామి కల్యాణం, సుదర్శన హోమం, 27న శతచండీ యాగం, మధ్యాహ్నం శివపార్వతుల కల్యాణం, 28న శతచండీ యాగం, అనంతరం పూర్ణాహుతి, మధ్యాహ్నం అవబృతస్నానము, వేద ఆశీర్వచనాలు, తీర్థప్రసాదాల వితరణ ఉంటుందన్నారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు.

శిథిల భవనానికి మోక్షం

నూతన నిర్మాణానికి నిధులు విడుదల


కొత్తపేటలో శిథిలావస్థకు చేరుకున్న భవనం

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధి కొత్తపేట గ్రామంలో శిథిలావస్థకు చేరుకున్న అంబేడ్కర్ యువజన సంఘం భవనానికి ఎట్టకేలకు నిధులు మంజూరయ్యాయి. గతేడాది ఆగస్టు 6న 'ప్రమాద ఘంటికలు' అనే శీర్షికతో సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనాన్ని స్థానికులు 4వ వార్డు కౌన్సిలర్ జింకల రాధిక శ్రవణ్, మున్సిపాలిటీ అధికారులు, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి కేఎల్లార్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో నూతన భవనం నిర్మాణం కోసం రూ.15.10 లక్షల నిధులు మంజూరు చేస్తూ ఈ నెల 17వ తేదీన ప్రొసీడింగ్ వచ్చాయి. దీంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

నిధుల మంజూరు హర్షణీయం



శిథిలావస్థకు చేరుకున్న ఈ భవనాన్ని నూతనంగా నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.15.10 లక్షల నిధులు మంజూరు చేయడం హర్షణీయం. ఈ భవనంలో సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతి, జయంతి కార్యక్రమాలను నిర్వహించేవారు. వీటితో పాటు వినాయక చవితి ఉత్సవాలు, స్వయం సహాయక పొదుపు సంఘాల సమావేశాలు ఏర్పాటు చేస్తారు. నిధులు మంజూరయ్యేలా కృషి చేసిన కేఎల్లార్‌కు ధన్యవాదాలు.

– జింకల రాధిక, కౌన్సిలర్

పీహెచ్‌సీలో కాన్పుల సంఖ్య పెంచాలి

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విజయలక్ష్మి


సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ విజయలక్ష్మి

కేశంపేట: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కాన్పుల సంఖ్యను పెంచాలని షాద్‌నగర్ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విజయలక్ష్మి అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆమె సందర్శించారు. అక్కడ నిర్వహిస్తున్న ఆరోగ్య మహిళ కార్యక్రమంలో పాల్గొని ఓపీని పరిశీలించారు. అనంతరం అమె మాట్లాడుతూ.. రోగులతో ప్రేమగా ఉండాలని, గ్రామాల్లో బీపీ, షుగర్ రోగులకు మందులను అందించాలని సూచించారు. గర్భిణులకు హైరిస్క్ కాకుండా నార్మల్ డెలివరీ అయ్యే విధంగా చూడాలన్నారు. గర్భిణులకు పోషకాహారం గూర్చి తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ నిఖిత, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, ఉపేందర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, మెర్సిలిన్, హన్మంతు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.


25 నుంచి సీపీఎం మహాసభలు

మాడ్గుల: సీపీఎం రాష్ట్ర నాలుగో మహాసభలు విజయవంతం చేయలని ఆ పార్టీ మాడ్గుల కార్యదర్శి రమేష్ కోరారు. ఈ మేరకు మండలంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మంగళవారం వాల్ పోస్టర్‌లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 25 నుంచి 28వ తేదీ వరకు సంగారెడ్డి పట్టణంలో సీపీఎం రాష్ట్ర మహా సభలు జరగనున్నాయన్నారు. ఇందులో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి పరిష్కారం కోసం కార్యాచరణ రూపొందిస్తారని తెలిపారు. ఈ సభలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు అంజయ్య, శ్రీను, నరసింహ తదితరులు పాల్గొన్నారు.


వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

ఇదేం 'లింకు'!

- అధ్వానంగా లింకు రోడ్లు
- అవస్థల్లో వాహనదారులు


కందుకూరు-ఫార్మాసిటీ మధ్యలో రోడ్డుకు ఇరువైపులా ముళ్ల చెట్లు


కందుకూరు-గూడూరు మధ్యలో రహదారి దుస్థితి

కందుకూరు: లింకు రహదారులు అభివృద్ధికి నోచుకోక ప్రజలు, రైతులు అవస్థలు పడుతున్నారు. అయినా సంబంధిత అధికారులు మాత్రం తమకు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇదీ మండల పరిధిలోని కందుకూరు నుంచి గూడూరు, మాలగూడూరు, కటికపల్లి గ్రామాలకు వెళ్లే లింకు రహదారుల దుస్థితి. కందుకూరు నుంచి ఫార్మాసిటీ రహదారి మీదుగా ఇటు గూడూరు, మాలగూడూరు, కటికపల్లి గ్రామాల మధ్య ఉన్న రహదారులు అధ్వానంగా మారాయి. మట్టితో ఉన్న ఆ రహదారులు వర్షాకాలం గుంతల్లో నీరు నిలిచి రాకపోకలు సాగించలేని పరిస్థితి. మరోపక్క రహదారులకు ఇరువైపులా కంప చెట్లు మొలిచి ఇబ్బందికరంగా మారాయి. కందుకూరు నుంచి ఆయా గ్రామాలకు వెళ్లే మూడు రహదారులను అభివృద్ధి పరిస్తే ప్రజలకు సౌలభ్యంగా మారుతుంది. ఆ దిశగా అధికారులు ప్రయత్నించి నిధులు మంజూరు చేసేలా కృషి చేయాలని స్థానికులు కోరుతున్నారు.